క్లుప్తంగా

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్, ప్రాజెక్ట్ నిర్వాహకులు

లేపాక్షి: గౌరిగానపల్లిలో గ్రీన్ కో శ్రీరామ్ పవర్ సోలార్ ప్రాజెక్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ నిర్మల బుధవారం ప్రారంభించారు. సుమారు రూ. 5.50 లక్షలతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిర్వాహకులను అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: పట్టణంలోని తన స్వగృహంలో బుధవారం రూ.2 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును బాధితుడి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే తిప్పేస్వామి అందించారు. అగళి మండలానికి చెందిన కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర డాక్టర్ దేవరాజు కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. ఈనేపథ్యంలో తనను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకుని సీఎం సహాయ నిధి నుండి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును బాధితుడి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే తిప్పేస్వామి అందించారు. బాధిత కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు డాక్టర్లు భార్గవి, విజయేంద్రరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆయన కోడలు దీక్షితతో పాటు 85 మంది గర్భిణులకు పండ్లు, పూలు అందించి సాంప్రదాయబద్ధంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం వారికి బేబీ కిట్లను అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, తద్వారా పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం



భక్తజనుల మధ్య సాగుతున్న కల్యాణోత్సవం

హిందూపురం: ముద్దిరెడ్డిపల్లిలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో బుధవారం స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. వేదపండితుడు విజయశర్మ, పురోహితులు ఉదయం కలశాలను కొలువుదీర్చి గణపతి, గంగ వాస్తు, వరుణ నాంది పూజలు చేశారు. అనంతరం రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలను మండపంలో కొలువుదీర్చారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణమహోత్సవం నిర్వహించారు. సాయంత్రం మంటప పూజ, దీక్షా హోమం చేసి రుక్మిణీ సమేత పాండురంగస్వామి వారిని గరుడ వాహనంపై నంది సర్కిల్ వరకు మేళతాళాలతో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యార్థులకు అనుగుణంగా బడిబస్సు నడపండి

హిందూపురం టౌన్: విద్యార్థులకు అనుగుణంగా బడి బస్సు నడపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఆర్టీసీ సీఐ హంపన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ మలుగూరు నుంచి పట్టణంలో విద్యను అభ్యసించడానికి 50 మంది దాకా విద్యార్థులు వస్తున్నారన్నారు. అయితే ఆర్టీసీ బడి బస్సు రాకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకుడు హర్ష కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అమరాపురం: పి.శివరంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



గోరంట్ల: వానవోలు పంచాయతీలో సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

అమరాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. బుధవారం మండలంలోని పి.శివరం బీసీ, ఎస్సీ కాలనీలోని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి గెలిస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని, దీన్ని చూసి ఓర్వలేక పోతున్నారని ప్రతిపక్ష నాయకులపై ధ్వజమెత్తారు. సీఎం జగనన్న గ్రామాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతులు కష్టపడకుండా ఆయా గ్రామాల్లోనే వేరుశనగ విత్తనకాయను అందిస్తున్నారన్నారు. ఇలాంటివి చూడలేక చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు వణుకు పుట్టిందన్నారు. ఎన్ని యాత్రలు చేసినావచ్చే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ, డైరెక్టర్లు రాజేశ్వరి, లక్ష్మీదేవి, సర్పంచ్ మంజుల, ఎంపీపీ ఈరన్న ,వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వార క్క నాయకులు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, అమరీష్‌బాబు, ప్రసాద్,నారాయణ, ఎంపీడీఓ మునిస్వామి, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలి..

గోరంట్ల: కులమత రాజకీయాలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు సీఎం జగన్ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వానవోలు పంచాయతీ పరిధిలోని పెట్లకుంటపల్లి, ఉగ్రారంపల్లి, బాచన్నపల్లి , గ్రామాల్లో సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వాటికి సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత మండల స్థాయి అధికారులను ఆదేశించారు. చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల ముందు ఆరు వందలకు పైగ హామీలను ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు నాయుడు అండ్ కో 2024 ఎన్నికల్లో ఎలాగైనా అధికారం చేజిక్కించుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలే తిప్పికొట్టాలని సూచించారు. పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరెడ్డి, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, వానవోలు సహకార సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు రాఘవేంద్రరావు, ఉప సర్పంచ్ బాబు, ఎంపీడీఓ రఘునాథగుప్తా, తహసీల్దార్ రంగనాయకులు, నాయకులు వడ్డే శ్రీనివాసులు, శివప్ప, గాండ్ల మల్లికార్జున, భాస్కరరెడ్డి, ఓబుళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి



కార్యదర్శి డాక్టర్ సుప్రవీణ్

హిందూపురం టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హిందూపురం శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక ఐఎంఏ హాలులో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ నరసింహారెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ సుప్రవీణ్, కోశాధికారిగా సతీష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ చంద్ర కిరణ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ ఆశోక్ రెడ్డి, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లుగా డాక్టర్ పద్మజ, డాక్టర్ షౌకత్ అలీ, స్టేట్ కౌన్సిల్ మెంబర్లుగా డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, డాక్టర్ హరీష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ సంధ్య రాణి, డాక్టర్ షర్మిల బేగం, డాక్టర్ సుష్మ, డాక్టర్ నందిశేఖర్, డాక్టర్ వెంకట రమణ నాయక్, డాక్టర్ ప్రభాకర్ నాయుడు, డాక్టర్ సాయి స్వరూప్, డాక్టర్ చరణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, సుప్రవీణ్ మాట్లాడుతూ హిందూపురం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. అనంతరం మాజీ అధ్యక్షుడు వెంకటరమణను సత్కరించారు. డాక్టర్లు అశ్వర్థరెడ్డి, రమేష్‌రెడ్డి, కేశవులు, ఆదినారాయణ, శ్రీనివాస రెడ్డి, రామమూర్తి, బాలాజీ, లోకనాథరెడ్డి, రత్నకుమారి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ



రక్తనిధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవానీ శంకరి

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవానీ శంకరి బుధవారం తనిఖీ చేశారు. అన్ని వార్డులను, రక్తనిధి, మాతాశిశు, రక్తపరీక్షలు, డయాలసిస్, డీఈఐసీ కేంద్రం, అత్యవసర విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్ ఆస్పత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న వైద్యసేవలు, పడకలు, రక్తనిధి నిల్వలను వివరించారు. ఈ సందర్భంగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు వైద్యుల తీరు, ఉచితంగా వైద్యమందుతోందా, మందులు ఇస్తున్నారా అంటూ రోగులతో అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు ఆస్పత్రిలో నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు. జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్‌తో శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎంఓ రుక్మిణమ్మ, వైద్యులు, నోడల్ అధికారి వన్నప్ప పాల్గొన్నారు.

‘గడప గడపకూ’ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

హిందూపురం: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ప్రజలు ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ దృష్టికి తెచ్చిన సమస్యలన్నీ పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం 18వ వార్డు సచివాలయ ఆవరణలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గడప గడప కార్యక్రమంలో ప్రజలు వీధి కాల్వలు, పబ్లిక్ టాయిలెట్స్, వీధిదీపాలు తదితర సమస్యలు తెలియజేశారని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ బాలసుబ్రమణ్యం, ఏఈ జనార్దన్, టీపీఆర్ఓ కిష్టప్ప, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పెనుకొండ: పట్టణ సమీపంలోని పులేకమ్మ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న పలువురు జూదరులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. 6 మంది జూదరులతో పాటు 4 సెల్‌ఫోన్లు, రూ.5,020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

6 వాహనాల సీజ్



రికార్డులను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు

పెనుకొండ రూరల్: స్థానిక 44వ నంబర్ జాతీయ రహదారిపై అమ్మవారిపల్లి కియా స్టేషన్ సమీపంలో బుధవారం రవాణా శాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు ట్యాక్స్, పర్మిట్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలించారు. రికార్డులు సరిగా లేనటువంటి 6 వాహనాలును సీజ్ చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సి.వి రమణ పేర్కొన్నారు.

అక్రమ లేఅవుట్ల తొలగింపు

రొళ్ల: అక్రమ లేఅవుట్లు వేసి విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, సర్పంచ్ రామలక్ష్మమ్మ హెచ్చరించారు. బుధవారం రొళ్ల పట్టణం సమీపాన శ్రీలక్ష్మీ విద్యనికేతన్ ప్రైవేట్ పాఠశాల వద్ద జాతీయ రహదారి పక్కన సర్వే నెంబర్ 186–1లో 1.83 సెంట్ల పైకి, 187.3ఎలో 0.84 సెంట్ల పైకి, 187–4ఎలో 0.86 సెంట్ల పైకి మొత్తం 3.86 ఎకరాల విస్తీర్ణంలో పంచాయతీ అనుమతి, అహుడా, డీటీసీపీ ద్వారా అక్రమంగా లేఅవుట్లు వేసినట్లు గుర్తించి సరిహద్దు రాళ్లను తొలగించారు.

సోమందేపల్లి ఎంఈఓ–2గా ఆనంద్ బాబు



ఎంఈఓను అభినందిస్తున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

సోమందేపల్లి: మండల విద్యాశాఖాధికారి–2గా ఆనంద్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీఎఫ్ నాయకులు నూతన ఎంఈఓను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎంఈఓ ఆనంద్ బాబు మాట్లాడుతూ.. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే రెగ్యులర్ ఎంఈఓ ఆంజనేయులు నాయక్‌ను కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ మండల అధ్యక్షుడు కిష్టప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రొద్దం: మండలంలోని పెనుకొండ–పావగడ ప్రధాన రహదారిపై ఈద్గా వద్ద మలుపులో ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో సోమందేపల్లి మండలం రంగేపల్లి గ్రామానికి చెందిన కదిరప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. కదిరప్ప పావగడ నుంచి రొద్దం వైపు వస్తూ గాయపడినట్లు పేర్కొన్నారు.

‘జగనన్న సురక్ష’ వేగవంతం చేయండి

లేపాక్షి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం లేపాక్షి–1, మధ్యాహ్నం మానేపల్లి సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సేవలు, సమస్యలను తెలుసుకోవాలన్నారు. హౌసింగ్, ఉపాధి తదితర పనులను పరిశీలించారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు, పాల్గొన్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని కమ్మవారిపల్లి సచివాలయ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను బుధవారం మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ 11 రకాల సేవలను ఉచితంగా సచివాలయాల ద్వారా అందించాలన్నారు. ఇందుకోసం గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. ప్రత్యేకంగా నిర్వహించే క్యాంప్ రోజుకు ముందే అన్ని సర్టిఫికెట్లను సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీడీఓ రఘునాథగుప్తా, సర్పంచ్ మణి, పాల్గొన్నారు.

గుడిబండ: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సమస్యలు ఇంటి వద్దనే పరిష్కారమవుతాయని జెడ్పీటీసీ భూతరాజు తెలిపారు. బుధవారం మండలంలోని హిరేతుర్పి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వే నిర్వహించారు.

పూల వ్యాపారులకు స్థల కేటాయింపు



స్థలాన్ని చదును చేయిస్తున్న నాయకులు

పెనుకొండ: పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ సర్కిల్‌లో పూల వ్యాపారం చేసుకునే వారికి స్థానిక ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని స్థలాన్ని బుధవారం కేటాయించారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తదితరులు స్థలాన్ని చదును చేయించారు. అనంతరం స్థలాన్ని పూల వ్యాపారులకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్ రఘునాథరెడ్డి, తయూబ్, సద్దాం, భాస్కర్‌నాయక్, నేమతుల్లా, నాయకులు శ్రీరాములు, బోయబాబు, సిక్బతుల్లా, మారుతి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: పట్టణంలోని ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో చేరడానికి జూలై 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుబ్బయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్ల నమోదుకు 7వ తేదీ వరకూ గడువు ఉంటుందన్నారు.

బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌కు సన్మానం

రొద్దం: బూచెర్ల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ బుధవారం ఉద్యోగ విరమణ పొందిన శంకరప్పను ఆ శాఖ అధికారులు గ్రామంలోని పోస్టాఫీస్‌లో ఘనంగా సన్మానించారు. పోస్ట్‌మాస్టర్‌గా శంకరప్ప ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ సబ్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విమల్‌కుమార్, ఆ శాఖ అధికారులు ప్రకాశ్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో రమేష్ బాబు అనే యువకుడు గాయపడ్డాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సోమందేపల్లి వైపు నుంచి పాపిరెడ్డిపల్లికి వెళ్తుతుండగా అతివేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పండ్ల తోటల పెంపకంతోనే ఆర్థికాభివృద్ధి

అగళి: పండ్ల తోటల పెంపకంతోనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏపీఓ శివన్న సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో బుధవారం పండ్లతోటల పెంపకం పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ జయసింహ, కోర్స్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నరహరి, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటప్ప,గిరిష, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

రొళ్ల: గ్రామీణులు ఇతర ప్రాంతాలకు వలసపోకుండా ఉన్న ఊళ్లలో ఉపాధి కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ ఓబుళప్ప సూచించారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

పెనుకొండ: మండలంలోని దుద్దేబండ, గుట్టూరు సచివాలయాలను ఎంపీడీఓ శివశంకరప్ప బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. జగనన్న సురక్ష సర్వేను ఇంటింటా నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోపు సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పుస్తకాల పంపిణీ

మడకశిర: పట్టణంలోని శ్రీసరస్వతీ విద్యామందిరం ప్రాథమిక ఇంగ్లిష్ మీడియం పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం బెంగళూరుకు చెందిన రోటరీ క్లబ్ ప్రతినిధులు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాల అధ్యక్షుడు సత్యనారాయణ, పాఠశాల కోశాధికారి అరవింద్, హెచ్ఎం జయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

పావగడ: స్థానిక ఆటో డ్రైవర్ల పిల్లలకు తాలూకాలోని జంగమరహళ్లికి చెందిన మాతృశ్రీ దారి దీప ఫౌండేషన్ చైర్మన్ హెచ్.లక్ష్మీనారాయణ బుధవారం విద్యా సామగ్రి అందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వేలు రాజ్, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బరాయప్ప, రాజేశ్ పాల్గొన్నారు.

అధిక సుంకం వసూలు అరికట్టండి

పావగడ: మున్సిపల్ అధికారులు నిర్ణయించిన సుంకం కంటే అధిక సుంకం వసూలు చేస్తూ తమను ఇబ్బందులు పెడుతున్నారని స్థానిక బస్టాండు లోని చిరు వ్యాపారులు బుధవారం ఆరోపించారు. ఈ సందర్భంగా వారు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ రూ 10, 15 మాత్రమే సుంకం వసూలు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్లు రూ. 30,రూ.100 వరకూ అధిక సుంకం వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ముఖ్యాధికారి షంషు మాట్లాడుతూ అధిక సుంకం వసూలు చేస్తున్నట్లు తన దృష్టి కి రాలేదని, అలా జరిగి ఉంటే వారిపై చర్యలు చేపడతానన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

అమరాపురం: అమరాపురం నుంచి కర్ణాటక రాష్ట్రం ధర్మపురానికి ఇసుకను టిప్పర్‌లో తరలిస్తుండగా సెబ్ సీఐ భార్గవరెడ్డి, స్థానిక ఎస్ఐ బీటీ.వెంకటేశ్వర్లు బుధవారం సీజ్ చేసి డ్రైవర్ వెంకటేశులును అరెస్ట్ చేశారు. కర్ణాటక బార్డర్‌లోని మద్దనకుంట పోలిమేరలో ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు వారు తెలిపారు. ఆంధ్ర ప్రాంతంలో అనుమతి తీసుకుని కర్ణాటకకు ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పరిగి: మండలంలోని బీచిగానిపల్లిలో బుధవారం పోలీసులు దాడి చేశారు. కల్లు గంగప్ప ఇంట్లో నిల్వ చేసిన 90 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే దాడులను ముందుగానే పసిగట్టిన గంగప్ప ఇంటి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గోవులను వధిస్తే కఠిన చర్యలు

పెనుకొండ: గోవులు, ఒంటెలను వధిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హుస్సేన్ పీరా పేర్కొన్నారు. పట్టణంలో మత పెద్దలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. జంతు హింస నిరోధక చట్టం ప్రకారం ఆవులు, ఒంటెలను వధించడం నేరమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, నేమతుల్లా, రామకృష్టప్ప పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతోనే సిరులు

పావగడ: తక్కువ వర్షపాతం నమోదవుతున్న పావగడ ప్రాంతంలో అధిక పెట్టుబడులు తో వేరుశనగ తదితర వర్షాధారిత పంటలు సాగు చేసి నష్టపోవడంకంటే తక్కువ పెట్టుబడితో చిరు ధాన్యాల పంటల సాగు చేసి ఆదాయం పొందవచ్చని వ్యవసాయ సంపన్మూల అధికారి బాబు సూచించారు. తాలూకాలోని జంగమరహళ్లిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కొర్రలు, రాగులు, అలసందలు, పెసలు తదితర పంటల సాగు పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి అందే సౌలభ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రోత్సాహిక రైతు గిరియణ్ణ, వ్యవసాయ శాఖ అధికారి బోరణ్ణ, సేవా ప్రతినిధులు రాధమ్మ , మహిళా రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల శాతం పెంచండి

గుడిబండ: ఉపాధి కూలీల శాతం పెంచాలని ఏంపీడీఓ రామారావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీఏలు, ఎఫ్ఏలు ప్రతి గ్రామానికీ వెళ్లి ఉపాధి పనులపై అవగాహన కల్పించి కూలీల శాతం పెంచాలన్నారు, కూలీల శాతం పెంచకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ భార్గవి, ఈసీ లక్ష్మానాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పీవీ సేవలు మరువలేనివి

హిందూపురం టౌన్: మాజీ ప్రధాన పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నేత బాలాజీ మనోహర్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు సేవలను కొనియాడారు. నాయకులు అమానుల్లా, జమీల్, అక్రమ్, ఆయాజ్, అజమ్తులా, ఫయాజ్, సయ్యద్, నరసింహ, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్ సందర్శన



సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి అశోక్‌కుమార్

మడకశిర: పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా బాలికల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను బాలికలు జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాలికలు బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు.

కంటి అద్దాల పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసిన దృశ్యం

చిలమత్తూరు: కోడూరు మఠ్రోతోపులోని జెడ్పీహెచ్ఎస్‌లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌ఓ పావని విద్యార్థులకు కంటి సంరక్షణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీమోహన్, ఎంపీటీసీ మంజునాథ్‌రెడ్డి, నాయకులు బాబూ ప్రసాద్, రామచంద్రప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.